నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 11 మే 2024 | HYDERABAD

ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్-2 పనుల పరిశీలన

సిటీబ్యూరో, మే 10(నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డు పరిధిలో విస్తరించిన గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి సరఫరా చేసేందుకు జలమండలి చేపట్టిన ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్-2లోని ప్యాకేజీ-2లో ఉన్న మల్లంపేట 3 ఎంఎల్ సామర్థ్యం రిజర్వాయర్‌ను ఎండీ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. అనంతరం, బాచుపల్లి ఫిల్లింగ్ స్టేషన్‌ను సందర్శించి.. ట్యాంకర్ల వివరాలు తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. ఈ ప్యాకేజీలో నిర్మిస్తున్న 38 రిజర్వాయర్లకు ఇప్పటికే 13 పూర్తయి అందుబాటులోకి వచ్చాయని సుదర్శన్‌రెడ్డి వివరించారు. మిగిలిన 25 రిజర్వాయర్లకు 13 పూర్తయి అందుబాటులో వచ్చాయని తెలిపారు. పురోగతిలో ఉన్న పనులను జూన్ వరకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం, రిజర్వాయర్ల ప్రాంగణంలో నిర్మించి పంప్ రూమ్‌ను ఎండీ పరిశీలించారు.

వర్షసూచన

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం నగరంలోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిసినట్లు చెప్పారు. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 37.8, కనిష్ఠం 26.2 డిగ్రీలు, గాలిలో తేమ 49 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల జియో ట్యాగింగ్

మొత్తం **3209** పోలింగ్ కేంద్రాలు..
సమస్యాత్మకమైనవి **387**
15 అతి సున్నిత ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్

13 కంపెనీల కేంద్ర బలగాలు..
6 వేల మంది సివిల్ పోలీసులతో భారీ బందోబస్తు

సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి వెల్లడి

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని చేవెళ్ల, మల్కాజిగిరితో పాటు మొత్తం 7 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో 13న జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 1218 లొకేషన్స్‌లలో 3209 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 90 పోలింగ్ లొకేషన్స్ పరిధిలో 387 సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లగా గుర్తించినట్లు వెల్లడించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కమిషనరేట్ పరిధిలో మొత్తం 289 మంది రూట్ ఆఫీసర్లను నియమించామని, వారికి కేటాయించిన రూట్లలో లొకేషన్లను పర్యవేక్షిస్తారన్నారు. అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్స్‌కు సహాయకులుగా ఏసీపీ స్థాయి అధికారులను కేటాయించినట్లు వివరించారు.

పోలింగ్‌కు భారీ బందోబస్తు

సైబరాబాద్ పరిధిలో 13న జరిగే పోలింగ్‌కు భారీ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు సీపీ వివరించారు. ఇందులో భాగంగా 13 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, 6వేల మంది సివిల్ పోలీసులు, 867 మంది ఆర్మ్‌డ్ ఫోర్స్ విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. ప్రతి ఈవీఎం స్టోరేజ్ పాయింట్స్ వద్ద ఇద్దరు చొప్పున పారామిలటరీ సిబ్బంది, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల వద్ద ఆరుగురు చొప్పున విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. అంతర్‌జిల్లా సరిహద్దుల వద్ద మొత్తం 22 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 15 సున్నిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలు, రెవెన్యూ అధికారులు, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు వెల్లడించారు. ఎన్నికలను సూక్ష్మంగా పరిశీలించేందుకు 23 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 24 స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను రంగంలోకి దింపామని, ఇవి 24/7 పాటు షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాయన్నారు.

రూ. 10.54 కోట్లు సీజ్

ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.10 కోట్ల 54 లక్షల 55,093 నగదు సీజ్ చేసినట్లు సీపీ చెప్పారు. 796 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 910 లైసెన్స్‌డ్ తుపాకులను డిపాజిట్ చేసినట్లు చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 1091 ఎన్నికల సంబంధిత ఎన్‌బీడబ్ల్యూ కేసులను ఎగ్జిక్యూట్ చేసినట్లు తెలిపారు.

నేటితో ప్రచారానికి తెర..

ఎల్లుండి సార్వత్రిక ఎన్నికల పోలింగ్

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్, చిత్రంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

- శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచార గడువు ముగింపు
- నిశ్శబ్ద కాలం.. నిబంధనలు విధిగా పాటించాలి
- ఎంసీఎంసీ అనుమతి లేకుండా ప్రచార ప్రకటనలు ప్రచురించొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్
- 15వేల మందితో భద్రత చర్యలు
- సీపీ శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, మే 10, (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల ప్రచారం నేటి సాయంత్రంతో ముగియనున్నది. సోమవారం జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం టూరిజం ప్లాజాలో పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు, పోలింగ్‌కు 72 గంటలు, 48 గంటల ముందు అత్యంత కీలకమైన నిశ్శబ్ద కాలానికి సంబంధించిన నిబంధనలపై సీపీ శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ రిటర్నింగ్ అధికారి, సీఈవో మధుకర్ నాయక్‌లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ మీడియాకు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాలకు జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మ్యాన్‌పవర్, మెటీరియల్ వంద శాతం పూర్తయిందని, ఈవీఎం కమిషనింగ్, పోలింగ్‌కు ముందు జరగాల్సిన ప్రక్రియ అంతా పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 3986 పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామని, 1250 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని వెల్లడించారు.

144 సెక్షన్ అమల్లో..

సీపీ శ్రీనివాస్ రెడ్డి

13న పోలింగ్ సజావుగా జరిగేలా 15వేల మందితో భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 6.00 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమల్లోకి వస్తుందని, పోలింగ్ ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం 6.00 గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు మద్యం షాపులను మూసివేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం

పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుంచి పోలీసు సిబ్బంది, ఎన్నికల అధికారులు నిర్వహించాల్సిన విధి విధానాలపై బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారాభవన్‌లో సీపీ శ్రీనివాస్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. పోలింగ్ రోజు వాహనాలు బూత్‌ల వద్దకు వెళ్లకుండా ఆపడం, ఓటర్లు మొబైల్ ఫోన్లు లోపలికి తీసుకెళ్లకుండా చూడటం తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు మంచి స్పందన

జిల్లాలో ఇప్పటివరకు 14,292 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని, హోం ఓటింగ్ ద్వారా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 362 మంది, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 119 మంది, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో 55 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు రోనాల్డ్ రాస్ వివరించారు. ఎసెన్షియల్ సర్వీసెస్ ఓటర్లు 7 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. జిల్లాలో సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 339 ఫిర్యాదులు రాగా, అన్నింటినీ పరిష్కరించామని, ఆయా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో మరింత నిఘా పెట్టామని తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో మెడికల్ టీం ఉంటుందన్నారు. ఓటర్లకు పోల్ క్యూ రూట్ యాప్‌ను అందుబాటులో ఉంచామన్నారు. క్యూలో ఎంతమంది ఉన్నారు? ఎంత సమయం పడుతుంది అన్న వివరాలు ఓటర్లు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. దీంతోపాటు పోలింగ్ కేంద్రాల లొకేషన్ చూసుకోవచ్చని రోనాల్డ్ రాస్ సూచించారు.

పోలింగ్ సిబ్బందికి ఉచిత రవాణా సౌకర్యం

పోలింగ్ సిబ్బందికి మే 12, 13వ తేదీల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, ఇందుకోసం జిల్లాలో సుమారు 37 పాయింట్స్ గుర్తించామని రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. పోలింగ్ ముందు ఆ పాయింట్ల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వరకు పోలింగ్ పూర్తయిన తర్వాత పోలింగ్ సంబంధించిన మెటీరియల్ అందజేసిన అనంతరం రిసెప్షన్ సెంటర్ నుంచి తిరిగి.. గుర్తించిన పాయింట్ వద్ద ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 'సాక్ష్యం' యాప్ ద్వారా ఇప్పటివరకు 311 మంది ఫ్రీ పికప్, ఓటు వేసిన తర్వాత తిరిగి డ్రాప్ చేయాలని అభ్యర్థన పెట్టారని, వారందరికీ ఆ సౌకర్యం కల్పిస్తామన్నారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ అయిన శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి జిల్లాలో జిల్లాయేతర వ్యక్తులు, ఇతర నియోజకవర్గం వారు ఎవరూ ఉండకూడదని స్పష్టం చేశారు. అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు అప్రమత్తతో క్షేత్ర స్థాయిలో పని చేస్తారని ,కళ్యాణ మండపాలు, హోటల్, లాడ్జింగులు వంటివి తనిఖీ చేస్తారని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజున, అలాగే పోలింగ్‌కు ఒక రోజు ముందు ఈ నెల 12, 13వ తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎంసీఎంసీ అనుమతి లేకుండా ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించవద్దని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ వివరాలు

నియోజకవర్గం	ఎన్‌రోల్ చేసుకున్నవారు	పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం
హైదరాబాద్ పార్లమెంట్	7,620	6,084
సికింద్రాబాద్ పార్లమెంట్	9,765	7,497
కంటోన్మెంట్ అసెంబ్లీ	874	711

పోలింగ్ కేంద్రాల్లో..ఐడీ ఉంటేనే ఎంట్రీ

హైదరాబాద్ ఆర్వో, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కనీస వసతులు కల్పించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కార్వాన్, బహదూర్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ కేంద్రాలు, నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని చార్మినార్ డీఆర్‌సీలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. చల్లని తాగునీరు, కరెంటు, టాయిలెట్స్, షెడ్స్, షామియానా, ఫర్నిచర్, కూలర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లోకి గుర్తింపు కార్డు లేని వారిని అనుమతించవద్దని ఆదేశించారు. అంతకు ముందు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని డీఆర్‌సీలో ఉన్న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. హోం ఓటింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి పటిష్ట భద్రత మధ్య ఉంచాలన్నారు. మెటల్ డిటెక్టర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు.

ఔటర్..ట్రాఫిక్ ఫుల్

ఏటా 15-20 శాతం పెరుగుతున్న రద్దీ

రోజుకు 1.80 లక్షల వాహనాల రాకపోకలు

పలు ఇంటర్‌చేంజ్ ఎగ్జిట్‌లలో ఇక్కట్లు

అదనంగా ర్యాంపుల నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రతిపాదనలు

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డుపై గణనీయంగా ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. గ్రేటర్ చుట్టూ 158 కి.మీ మేర ఉన్న ఓఆర్ఆర్ మీదుగా కోర్ సిటీ లోపలి నుంచి ఎక్కడికైనా వెళ్లేందుకు వీలుగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులతో పాటు ప్రత్యేకంగా రేడియల్, లింకు రోడ్లు ఉండటంతో నగరవాసులు ఔటర్‌ను తమ రాకపోకలకు ఎక్కువగా వినియోగిస్తున్నారు. కొన్ని కిలోమీటర్ల దూరం పెరిగినా.. ఎంతో వేగంగా, భద్రతతో గమ్యస్థానానికి చేరుకునేందుకు అత్యంత అనుకూలంగా ఉండటంతో ఔటర్‌పై ఏటా ట్రాఫిక్ రద్దీ 15-20 శాతం వరకు పెరుగుతోంది. తాజాగా ప్రతి రోజు 1.80 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఓఆర్ఆర్‌పై ఎక్కువగా ఐటీ కారిడార్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో కొత్తగా రెండు ఇంటర్‌చేంజ్‌లలో ఒక దానిని నార్సింగి వద్ద నిర్మించి ఇప్పటికే ప్రారంభించగా, కోకాపేట నియో పోలిస్ లే అవుట్‌ను అనుసంధానం చేస్తూ..మరో ఇంటర్‌చేంజ్ నిర్మాణంలో ఉన్నది. అదేవిధంగా పటాన్‌చెరు-దుండిగల్ మార్గంలో మల్లంపేట-బాచుపల్లి వద్ద మరో ఇంటర్‌చేంజ్‌ను నిర్మించి.. అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏటా ట్రాఫిక్ పెరుగుతుండటంతో ఇంటర్‌చేంజ్‌ల వద్ద ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపుల వద్ద వాహనాలు పెద్ద సంఖ్యలో బారులు తీరుతున్నాయి. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డు దాటిన తర్వాత ఉన్న ప్రాంతాల్లోనూ పట్టణీకరణ శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఔటర్‌పై ఉన్న ఇప్పటికే ఇంటర్‌చేంజ్‌ల వారీగా వాహనాల రాకపోకలు గుర్తించి.. కొత్త ఇంటర్‌చేంజ్‌ల నిర్మాణంపై దృష్టి సారించారు. అదే సమయంలో ఇంటర్‌చేంజ్‌ల వద్ద ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపులను పెంచాల్సిన అవసరమున్నదని గుర్తించారు.

మొత్తం 21 చోట్ల ఇంటర్‌చేంజ్‌లు..

ఔటర్ రింగు రోడ్డుపై మొత్తం 21 చోట్ల ఇంటర్‌చేంజ్‌లు ఉన్నాయి. అక్కడి నుంచి వాహనాలు ఓఆర్ఆర్‌పైకి ఎక్కేందుకు, కిందకు దిగేందుకు ఎంట్రీ, ఎగ్జిట్ పేరుతో ర్యాంపులను కేవలం రెండు వరసల్లో నిర్మించారు. ప్రస్తుతం వాహనాల రద్దీ గణనీయంగా పెరగడంతో ఎంట్రీ చేసే సమయంలో రశీదు ఇచ్చేందుకు వాహనాలు ఆగాల్సి వస్తోంది. అదేవిధంగా దిగే సమయంలో ఫాస్టాగ్ చెల్లింపులు చేసేందుకు, ఫాస్టాగ్ లేని వారు నేరుగా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఓఆర్ఆర్‌పైకి ఎక్కిన సమయంలో ఇచ్చే రశీదును ఇచ్చి.. టోల్ చార్జీలను చెల్లించేందుకు వాహనాలను నిలుపాల్సి వస్తోంది. దీంతో ఈ సమయంలో వాహనాలు ఎక్కువగా ఇంటర్‌చేంజ్‌ల వద్ద ఉన్న డౌన్ ర్యాంపు(ఎగ్జిట్)లపై రెండు వరసల్లో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఓఆర్ఆర్‌పై గంటకు 120 కి.మీ నుంచి 80 కి.మీ వేగంతో ప్రయాణించే వాహనాలు.. కిందకు దిగే సమయంలో కొన్ని ర్యాంపుల వద్ద 2 నుంచి 5 నిమిషాల పాటు ఆలస్యమవుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఆలస్యం కారణంగా కొన్ని ఇంటర్‌చేంజ్ డౌన్ ర్యాంపుల వద్ద వాహనదారులు ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా నిర్వాహకులతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన హెచ్ఎండీఏ అధికారులు.. రద్దీ ఎక్కువగా ఉన్న ఇంటర్‌చేంజ్‌ల వద్ద ట్రాఫిక్ అధ్యయనం చేపట్టారు. ఇంటర్‌చేంజ్‌ల వద్ద వాహనాలు వేగంగా ఎగ్జిట్ అయ్యేందుకు అదనంగా ర్యాంపులను నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

భారీ మెజార్టీతో 'రాగిడి'ని గెలిపించుకోవాలి

మీర్‌పేట హెచ్‌బీకాలనీ డివిజన్‌లో పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్, ఏప్రిల్ 10: మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ, మల్లాపూర్ డివిజన్లలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జె.ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. మీర్‌పేట్ డివిజన్ రాజీవ్‌నగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి.. రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు. గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్'పై ఎగిరేది గులాబీ జెండానే

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడ్‌పల్లి, మే 10: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంపై ఎగిరేది బీఆర్ఎస్ జెండాయేనని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం మోండా డివిజన్‌లోని పాట్ మార్కెట్ లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు మంగళ హారతులు, పూల మాలలతో ఘన స్వాగతం పలికారు. 'నిత్యం మా వెంటే ఉండే పద్మారావు గౌడ్ కే ఓటు వేస్తాం' అని ప్రజలు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ...సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి జరగాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా..కారు గుర్తుకు ఓటు వేసి పద్మారావుగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు చేసిందీమే లేదని, మళ్లీ బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో ప్రజలు ఆలోచించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రూప, డివిజన్ అధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు నాగులు, రాములు, జయరాజ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మోండా డివిజన్‌లోని పాట్ మార్కెట్ జ్యూవెల్రర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించి మద్దతు తెలిపారు. పద్మారావు గౌడ్ గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మోండా మార్కెట్ డివిజన్‌లో ప్రచారంలో పాల్గొన్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే తలసాని